

తాళ్లబురిడిలో అదుపులోనే డయేరియా: డీఎంహెచ్‌వో

పార్వతీపురం రూరల్, మార్చి10(ఆంధ్రజ్యోతి): తాళ్లబురిడి గ్రామంలో డయేరియా అదుపులో ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు తెలిపారు. సోమవారం ఆ గ్రామంలో ఆయన పర్యటించి.. ప్రస్తుత పరిస్థితిపై వైద్యసిబ్బందితో సమీక్షించారు. గత శుక్రవారం గ్రామంలో 19 మంది విరేచనాలు, వాంతులతో ఇబ్బంది పడగా, వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసి చికిత్స అందజేశామని తెలిపారు. వ్యాధి ప్రబలకుండా వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. ఆ గ్రామంలో 12 చోట్ల తాగునీటి పరీక్షల నిర్వహించగా ఫలితాలు నెగిటివ్‌గా వచ్చాయన్నారు.

కరకట్టలేక కష్టాలు

- వంశధారకు వరదొస్తే వణుకే.. ● ఏటా ముంపు సమస్య
- నదీ తీర ప్రాంతవాసులకు తప్పని ఇబ్బందులు
- ఒడిశా భూభాగంలో చురుగ్గా రాతికట్టల నిర్మాణం
- పట్టించుకోని గత వైసీపీ సర్కారు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



లివిరి వద్ద కోతకు గురవుతున్న సాగు భూములు

భామిని, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వంశధార నదికి వరదొస్తే చాలు.. భామిని మండల పరిధిలోని తీర గ్రామాల ప్రజలు చిగురుటాకుల్లా వణికిపోవాల్సిన దుస్థితి. ఏటా ముంపు సమస్యతో పంటలను సైతం కోల్పోవల్సి వస్తోంది. రోజుల తరబడి వరద నీటిలోనే ఉండాల్సిన పరిస్థితి. దీర్ఘకాలికంగా వారు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. నదికి ఇరువైపులా నీటి వినియోగం, ఇసుక తవ్వకాలు, కరకట్టల నిర్మాణం ఒకేలా ఉంటే ఎవరికి నష్టం ఉండేది కాదు. కానీ అందుకు భిన్న పరిస్థితి నెలకొంది. ఒడిశా ప్రభుత్వం వరదలను శాశ్వతంగా ఎదుర్కొనేందుకు నదీతీరం ఆవల వైపు ఆ రాష్ట్ర భూభాగంలో రాతితో కరకట్టలు నిర్మించింది. భామిని మండలం వైపు మాత్రం ఆ పనులు చేపట్టలేదు. దీంతో ఏటా వరదల సమయంలో ఈ ప్రాంతంలో భూములు కోతకు గురవుతున్నాయని, ముంపు సమస్యతో సతమతమవుతున్నామని భామిని మండల పరిధిలోని సుమారు పది నదీతీర ప్రాంత రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

- గతంలో నేరడి వద్ద బ్యారేజీ, వరద కాలువ నిర్మాణాలను ఒడిశా సర్కారు అడ్డుకొని ఢిల్లీ న్యాయస్థానానికి వెళ్లింది. ఇప్పటికీ ఈ సమస్య కొలిక్కి రాకపోగా ఆ ప్రభుత్వం మాత్రం నదీ జలాలను యథేచ్ఛగా వినియోగిస్తోంది.
- 1980లో వంశధారకు భారీ వరదలు వచ్చాయి. అప్పట్లోనే ఒడిశా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంది. వంశధార నది ఆవల గ్రామాలైన ఒడిశాలోని గజపతి జిల్లా పరిధి సరా, బడిగాం, పురిటిగూడ, గౌరి, కిత్తంగి, బుదర, బొత్తవ, కాశీనగర్, ఈదుడి తదితర గ్రామాల్లో వీలున్న చోట్ల వ్యవసాయ బోర్లు, లిఫ్ట్ ఇరిగేషన్లు ఏర్పాటు చేసింది. దీంతో ఆయా ప్రాంతాల్లో రెండు సీజన్లలో పంటలు పండిస్తున్నారు. సాగునీటిని వినియోగానికి ఏ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంది.
- సరా, ఒడిగాం నుంచి కాశీనగరం వరకు గతంలో నిర్మించిన మట్టికట్టలు, గట్లు నదిలో కలిసిపోవడంతో రాతి కట్టల నిర్మాణాలను ఒడిశా చేపట్టింది. అయితే దీనివల్ల భామిని మండలానికి తీరని నష్టం వాటిల్లుతోంది. వంశధారకు వరదలు వచ్చే సమయంలో ఈ ప్రాంతంలో సాగు భూములు కోతకు గురవుతున్నాయి.
- ఆంధ్రా వైపు కరకట్టల నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. కాగా తీరం నుంచి 200 మీటర్లు విడిచిపెట్టి భూసేకరణ కింద పంట భూములను స్వాధీనం చేసుకోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒడిశాలో నదీ తీరంలోనే రాతికట్టలు నిర్మిస్తే ఆంధ్రా వైపు రైతు భూముల్లో నిర్మించడమేనని వారు ప్రశ్నిస్తున్నారు.
- గత కొన్నేళ్లుగా వంశధారకు భారీ వరదలు లేవు. దీంతో ఆంధ్రా భూభాగంలో ఉన్న కోసలి, కీసర, సొలికిరి, లివిరి, బిల్లుమడ, పసుకుడి తదితర నదీతర గ్రామ రైతులు ఊపిరిపీల్చుకున్నారు.
- బత్తిలి నుంచి కీసర , కోసలి వరకు 30 కిలోమీటర్ల మేర వంశధార నది ప్రవహిస్తున్నా.. లిఫ్ట్ ఇరిగేషన్లు ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులు చుక్క నీటిని వినియోగించుకోలేకపోతున్నారు. సొలికిరి అవతల ఒడిశాలోని ఈదుడి వద్ద కొద్దికాలంగా రాతికట్టల నిర్మాణం చేపడుతున్నారు. దీంతో వరదలు వస్తే బాలేరు, సొలికిరి గ్రామాల్లో పంట పొలాలు నీట మునుగుతున్నాయి. అదేవిధంగా తాలాడ, కోసలి, కీసర గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. కరకట్టలు, ఎత్తిపోతల పథకాలు, ఇసుకరీచ్, నదీజలాల వినియోగం, వరద ముంపుపై ప్రభుత్వం స్పందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

ఆంధ్రా వైపు ఉన్న ఒడిశా భూముల్లో ఇసుక తరలింపునకు ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో కొన్నాళ్లుగా నదీ తీరంలో తవ్వకాలు జరుపుతున్నారు. కాగా భామిని మండలం దిమ్మిడిజోల సమీపంలో ఇసుకను తరలిస్తుండడంతో ఈ ప్రాంతంలో ఉన్న వ్యవసాయ భూములపై ఆ ప్రభావం పడుతోంది. ఏటా వరదల సమయంలో అవి ముంపునకు గురవు తున్నాయి. మరోవైపు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భామినికి చెందిన కొంత మంది మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు మద్దతు ఇవ్వడంతో ఒడిశా వాసులు యథేచ్ఛగా తమ దందా కొనసాగించారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒడిశా అనుమతులతో తాలాడ, బిల్లుమడ, సింగిడి, నేరడి వద్ద ఇసుక అడ్డగోలు తవ్వకాలకు బ్రేక్ పడింది.



దిమ్మిడిజోల నది ఆవల ఒడిశా నిర్మించిన రాతికట్టలు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో..

బత్తిలి నుంచి కొత్తూరు మండలం ఆకులతంపర వరకు 56 కిలోమీటర్ల మేర నదికి ఇరువైపులా ఆంధ్రా భూభాగంలో కరకట్టల నిర్మాణానికి 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు రూ.316 కోట్లతో సాయిలక్ష్మి కంపెనీ పనులు ప్రారంభించింది. అయితే ఏడు శాతం పనులే అయ్యాయి. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని నిలిపేసింది.

ప్రతిపాదనలు పంపించాం..

భామిని మండలం వంశధార నది పరిధిలో కరకట్టల నిర్మాణం కోసం మరోసారి ప్రతిపాదనలు పంపించాం. ఒడిశా వైపు కరకట్టల నిర్మాణంతో ఆంధ్రా వైపు భూములు కోతకు గురవుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం. అనుమతులు ఇచ్చిన వెంటనే పనులు చేపడతాం.

-బాల్జీ, డీఈ, ఉమ్మడి జిల్లా

వెంటనే నిర్మించాలి..

దిమ్మిడిజోల వంశధార రేవులో ఒడిశా వైపు రాతికట్టలు ఉన్నాయి. మరోవైపు ఆ రాష్ట్ర అనుమతులతో ఆంధ్రా వైపు ఇసుక తవ్వకాలు చేపట్టడం వల్ల భారీ వరదల సమయంలో ఈ ప్రాంతంలో సాగు భూములు ఏటా ముంపునకు గురవుతున్నాయి. దీంతో ఏటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒడిశా మాదిరిగా నదీతీరంలో ఆంధ్రా భూభాగంలో వెంటనే కరకట్టలు నిర్మించాలి.

- వలరౌతు ఉమాపతినాయుడు,
రైతు సంఘం అధ్యక్షుడు, దిమ్మిడిజోల

రక్షణ కల్పించాలి

వంశధార వరదల వల్ల ఏటా కీసర, కోసలి, ఘనసరలో పంటలను నష్టపోవాల్సి వస్తోంది. గత వైసీపీ సర్కారు నిలుపుదల చేసిన కరకట్టల పనులను కూటమి ప్రభుత్వం పూర్తిచేయాలి. మా పంటలకు రక్షణ కల్పించాలి. ముంపు సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి.

- కె.లక్ష్మంనాయుడు, రైతు, కోసలి

ఆయుర్వేదం గిరిజనులకు దూరం

- అవగాహన లేక వైద్యసేవలు పొందలేకపోతున్న వైనం
- కానరాని శిబిరాలు
- దీర్ఘకాలిక వ్యాధులతో గిరిపుత్రులు సతమతం
- పట్టించుకోని ఆ శాఖ అధికారులు



సీతంపేటలో ఆయుర్వేద ఆసుపత్రి

సీతంపేట రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో గిరిజనులు ఆయుర్వేద వైద్యం పొందలేకపోతున్నారు. అవగాహన లేని కారణంగా ఆ సేవలకు దూరమవుతున్నారు. దీనిపై చైతన్యపర్చాల్సిన ఆ శాఖ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. దీంతో సీతంపేటలో ఆయుర్వేద ఆసుపత్రి ఉందనే సమాచారం చాలామంది ఆదివాసీలకు తెలియదు. కేవలం సీతంపేట గ్రామస్థులు మాత్రమే ఆ వైద్య సేవలు పొందుతున్నారు. వాస్తవంగా ఐటీడీఏ పరిధిలోని అధిక శాతం గిరిజనులు దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. రక్తహీనత, పక్షవాతం, క్షయ, వెన్నెముక, తలనొప్పి, జ్వరం, కీళ్లవాతం, గ్యాస్ట్రిక్ వంటి సమస్యలతో సతమవుతున్నారు. వాటికి ఆయుర్వేద వైద్యంలో సైడ్ ఎఫెక్ట్ చూపని మందులు అందుబాటులో ఉన్నాయి. అయితే వాటిపై అవగాహన లేక పోవడంతో సీతంపేట ఆయుర్వేద ఆసుపత్రికి రోజుకి ఐదుగురుకు మించి రావడం లేదు. ఒక్క సోమ వారం మాత్రమే 10మంది వరకు ఓపీ ఉంటుంది. కాగా ఈ ఆసుపత్రిలో సుమారు 50 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

వెంటాడుతున్న సమస్యలు

సీతంపేటలో ఉన్న ఆయుర్వేద ఆసుపత్రికి శాశ్వత భవనం లేదు. ఐటీడీఏకు చెందిన ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలోనే నిర్వహిస్తున్నారు. ఇక్కడ మూడు పోస్టులకు గాను కాంపౌండర్ పోస్టును ఎన్నో ఏళ్లుగా భర్తీ చేయడం లేదు. ఈ సమస్యలపై ఉన్నతాధికారులు స్పందించి ఏజెన్సీ ప్రాంతాల్లో ఆయుర్వేద వైద్య సేవలు విస్తరింపచేయాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

సంతల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తే..

మండలంలో ప్రతి వారంలో సీతంపేట, కుసిమి, దోనుబాయి, పూతికవలస, మర్రిపాడు వంటి ప్రాంతాల్లో వారపుసంతలు జరుగు తుంటాయి. అనేక ప్రాంతాల నుంచి గిరిజనులు వస్తుంటారు. ఇటు వంటి సంతల్లో ఆయుర్వేద శిబిరాలను ఏర్పాటు చేసి సంతకు వచ్చే గిరిజనులకు అవగాహన కల్పిస్తే వారికి ఈ సేవలపై నమ్మకాన్ని కలిగించవొచ్చు. అంతేకాకుండా దీర్ఘకాలిక వ్యాధులతో మృత్యువాత పడుతున్న గిరిజనులను కూడా కాపాడొచ్చు.

వైద్యాధికారి ఏమన్నారంటే...

ఆయుర్వేద వైద్యంపై వారపు సంతల్లో అవగాహన కల్పిస్తామని వైద్యాధికారి బి.నందనసాయిరెడ్డి తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు సీతంపేట ఆయుర్వేద ఆసుపత్రికి ఎక్కువగా వస్తారని చెప్పారు.

పింఛన్ల బదిలీకి అవకాశం

- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం ● లబ్ధిదారుల హర్షం



కొమరాడ, మార్చి10 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్లు పొందుతున్న వారికి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఒకపై లబ్ధిదారులు వారు కోరుకున్న చోటుకు పింఛను బదిలీ చేసుకునే అవకాశాన్ని తీసుకొచ్చింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. సచివాలయాల ద్వారా ఈ సేవలను పొందొచ్చని వెల్లడించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో జిల్లాలో సామాజిక పింఛన్‌దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా ప్రతినెలా ఒకటో తేదీనే కూటమి ప్రభుత్వం పింఛన్ల నగదు అందిస్తోంది. నెలలో మొదటి తేదీ సెలవు రోజు అయితే ముందు నెల చివరి రోజే పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటుంది. అయితే ఈ క్రమంలో దీంతో దూర ప్రాంతాల్లో ఉన్న కొందరు లబ్ధిదారులు వ్యయ ప్రయాసలకోర్చి సొంత గ్రామాలకు రావాల్సి వస్తుంది. వారి ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం పింఛన్ల బదిలీలకు అవకాశం కల్పించింది.

ఇలా చేయాలి

- ఎన్టీఆర్ భరోసా పింఛన్ బదిలీ చేయించుకోవాలనుకునే లబ్ధిదారులు గ్రామ సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి.
- పింఛన్ వెబ్‌సైట్‌లో దీనికోసం ప్రభుత్వం ప్రత్యేక ఆప్షన్ ఇచ్చింది. ఇందులో పింఛన్ ఐడీ ఏ ప్రాంతం బదిలీ చేయాలను కుంటున్నారో ఆ ప్రాంతం చిరునామా ఇవ్వాలి.
- నివాసం ఉంటున్న జిల్లా, మండలం, గ్రామ సచివాలయం పేర్లు పొందుపరచాలి.
- ఈ నూతన విధానం పింఛన్‌దారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని కొమరాడ ఎంపీడీవో మల్లికార్జునరావు తెలిపారు. ఇకపై ప్రతినెలా ఒకటో తేదీన స్వగ్రామాలకు రావాల్సిన అవసరం లేదని.. వారున్న చోటనే పింఛన్ నగదు పొందొచ్చని వెల్లడించారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని 15 మండలాలు, రెండు పట్టణాలు, ఒక నగర పంచాయతీ పరిధిలో మొత్తంగా 1,39,908 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారికి ఎన్టీఆర్ భరోసా కింద ప్రతినెలా ప్రభుత్వం వివిధ రకాల సామాజిక పింఛన్లను అందిస్తోంది. కాగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక నెల పింఛన్ తీసుకోకపోతే వెంటనే రద్దు చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం మూడు నెలలకు ఒకసారి పింఛన్ నగదు మొత్తం ఒకేసారి పొందే వెసులుబాటును కల్పించింది. తాజాగా పింఛన్ల బదిలీలు చేసుకొనేందుకు అవకాశాన్ని ఇవ్వడంతో దూర ప్రాంతాల్లో ఉన్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సికిల్‌సెల్ అనీమియాతో యువకుడి మృతి



కిరణ్‌సాయి (ఫైల్)

సీతంపేట రూరల్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): సికిల్‌సెల్ అనీమియాతో బాధపడుతూ సీతంపేటకు చెందిన టి.కిరణ్ సాయి(23) సోమవారం మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కిరణ్‌సాయి ఆరోగ్యం విషమించడంతో శనివారం కుటుంబ సభ్యులు తొలుత సీతంపేట ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి మెరుగవక పోవడంతో వైద్యుల సూచనల మేరకు వెంటనే శ్రీకాకుళంలో ఆసుపత్రికి కిరణ్‌సాయిని తరలించారు. అక్కడి నుంచి విజయనగరంలో ఆసుపత్రికి తీసుకెళ్లారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కిరణ్‌సాయి తండ్రి వేణు ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. చేతికందొచ్చిన కుమారుడి మృతితో తల్లిదండ్రులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యాన్ని ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. దీనిపై పురపాలక సంఘాలు, పంచాయతీల్లో తీర్మానం చేసి అమలు చేయాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ నిషేధంపై బోర్డులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. ఎవరైనా దానిని వినియోగించినా.. విక్రయించినా జరిమానా తప్పదని చెప్పారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని, ప్రభుత్వ కార్యా లయాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్‌ను అమల్లోకి తీసుకొచ్చిందని, దీని ద్వారా అన్ని రకాల సేవలను పొందొచ్చని వెల్లడించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాల రవాణా, బాల్య వివాహాల నిర్మూలన వంటి అంశాలపై పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ, ఇన్‌చార్జి జేసీ హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రుని ప్రభ ఊరేగింపు

- భారీగా తరలివచ్చిన భక్తులు



6లో

డ్రాగన్‌తో ఆదాయ ఫలాలు

- సేంద్రియ పద్ధతిలో సాగు ● ఆదర్శంగా నిలుస్తున్న కన్నబాబు



6లో

శాసనసభలో మన వాణి 6లో

అటవీ అనుమతులు లేక.. పనుల్లో జాప్యం
- ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి

మౌలిక సదుపాయాలు లేవు..
- పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

డ్రాగన్‌తో ఆదాయ ఫలాలు

● సేంద్రియ పద్ధతిలో సాగు ● ఆదర్శంగా నిలుస్తున్న కన్నబాబు

వీరఘట్టం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి)

డ్రాగన్ ఫ్రూట్స్.. ఒకప్పుడు ఏ దూర ప్రాంతాల నుంచో ఒకరో ఇద్దరో వీటిని తీసుకొస్తే వింతగా అనిపించేది. వీటి ధర చూసి తినాలని ఆసక్తి కలిగేది. కానీ ప్రస్తుతం మన ప్రాంతంలోనూ ఇవి అందుబాటులోకి వచ్చేస్తున్నాయి. జిల్లాలో కొంత మంది రైతులు వీటి సాగుతో లాభాలు ఆర్జిస్తున్నారు. వీరిలో మండలంలోని గడగమ్మ గ్రామానికి చెందిన ఉదయాన కన్నబాబు కూడా ఉన్నారు. డ్రాగన్ ఫ్రూట్స్ సాగు చేస్తూ... లాభాలు ఆర్జిస్తున్నట్టు ఆయన చెబుతున్నారు. కన్నబాబు తన 2.5 ఎకరాల పొలంలో ఐదువేల డ్రాగన్ మొక్కలను నాటారు. రిటైర్డు ఆర్మీ ఉద్యోగి అయిన కన్నబాబు గుంటూరు జిల్లా పిడుగురాళ్ల నుంచి ఈ మొక్కలు తెప్పించినట్టు చెబుతున్నారు. ఒక్కో మొక్కకు రవాణాతో కలిపి రూ.70 చొప్పున ఖర్చయిందని అంటున్నారు. ఎటువంటి ఎరువులు, రసాయనాలు వాడకుండా పూర్తిగా సేంద్రియ పద్ధతిలోనే పంటను సాగు చేస్తున్నానని చెప్పారు. మొదటి ఏడాది 500 కేజీల దిగుబడి వచ్చింది. రెండో సంవత్సరం రెండు వేల కిలోల దిగుబడి వచ్చింది. కిలో రూ.150 నుంచి రూ.200 వంతున పొలం వద్దనే అమ్మానని రైతు చెప్పారు. మొదటి ఏడాది పంట సాగుకు రూ.18 లక్షలు ఖర్చయిందని తెలిపారు. డ్రిప్పు పద్ధతిలో నీటిని అందిస్తున్నట్టు వెల్లడించారు. దీని వల్ల తక్కువ నీటితోనే పంటను సాగు చేయవచ్చునని చెబుతున్నారు. ఒకసారి డ్రాగన్ ఫ్రూట్ మొక్క నాటితే 25 నుంచి 30 సంవత్సరాల వరకు పంట వస్తుందన్నారు. ఏటా ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు విడతల వారీగా పంట కోతకు వస్తుందని.. దీని సాగు ఎంతో లాభదాయకమని అంటున్నారు. సమీప గ్రామాల రైతులు వచ్చి ఈ పంట సాగుకు సంబంధించిన మెలకువలు తెలుసుకుంటున్నారని కన్నబాబు వివరించారు.

మన ప్రాంతం అనుకూలం..

మన ప్రాంతాల్లో కూడా డ్రాగన్ ఫ్రూట్స్ పండించవచ్చు. ఇక్కడ వాతావరణం అందుకు అనుకూలంగా ఉంది. రైతులకు లాభదాయకమైన పంట డ్రాగన్ ఫ్రూట్.

-అమరేశ్వరి, ఉద్యానవన అధికారి



వ్యవసాయంపై ఆసక్తితోనే...

నాకు వ్యవసాయం చేయడమంటే చాలా ఇష్టం. ఆర్మీ ఉద్యోగం నుంచి రిటైరైన తర్వాత నాకు ఉన్న పొలంలో డ్రాగన్ పంటను వేశాను. మొదటి సంవత్సరమే ఖర్చు. ఆ తర్వాత 25 నుంచి 30 సంవత్సరాల వరకు ఆదాయం వస్తుందని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు.

-ఉదయాన కన్నబాబు, రైతు

డ్రాగన్ ఫ్రూట్ తోటలో రైతు కన్నబాబు



నేడు పోలమాంబ ఏడో వారం జాతర

మక్కువ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత శంబర పోలమాంబ అమ్మవారి ఏడో వారం జాతర మంగళవారం జరుగనుంది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ తెలిపారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 120 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్టు ఎస్ఐ ఎం.వెంకటరమణమూర్తి తెలిపారు.

భక్తుల కల్పవల్లి.. పోలిపల్లి పైడితల్లి

● నేడు ఘటోత్సవం

రాజాం/రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పోలిపల్లి పైడితల్లి అమ్మవారి 99వ జాతరలో భాగంగా రెండోరోజు సోమవారం ఆలయం భక్తజనంతో కిటకిటలాడింది. దశాబ్దాలుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం కళింగ సామాజిక వర్గం వారు సోమవారం అర్ధరాత్రి దాటాక అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి అమ్మవారి ఆలయ తలుపులు మూసుకోలేదు. దీంతో వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం ఘటోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వేమకోటి సూర్యనారాయణ శర్మ సారథ్యంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఈవో బీవీ మాధవరావు, ఎస్.వి.ఆర్. కళాపరిషత్ అధ్యక్షులు సలాది తులసీదాస్ పర్యవేక్షణలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

● అర్ధరాత్రి వేళ...

శ్రీ పోలిపల్లి పైడితల్లి అమ్మవారి మహోత్సవాలలో మంగళవారం కీలకమైన ఘటోత్సవాన్ని నిర్వహించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలలో స్థిరపడిన ఈ ప్రాంతీయులంతా మంగళవారం అమ్మవారిని దర్శించుకుంటారు. మంగళవారం అర్ధరాత్రి 12.09 గంటలకు ఘటోత్సవం జరుగుతుంది. ఈనెల 7న నేత్రోత్సవం సందర్భంగా అమ్మవారిని రాజాంలోని దేవస్థానం నుంచి కొండంపేటలోని ఘటాలయానికి లంకలపల్లి కుటుంబీకులు కర్ర ప్రతిమలలో తీసుకెళ్లారు. అమ్మవారు తిరిగి మంగళవారం రాత్రి 12.09 గంటలకు ఘటాలతో రాజాంలోని ప్రధాన ఆలయంలోకి ప్రవేశిస్తారు. లంకలపల్లి కుటుంబీకులు ఘటాలతో అమ్మవారిని తీసుకువచ్చి ప్రధాన ఆలయంలో విడిచిపెట్టి... తిరిగి ఇంటిముఖం పడతారు. ఈ ఉత్సవాన్నే ఘటోత్సవం అంటారు. ఇది పూర్తికాగానే జాతర ముగిసినట్లు భావిస్తారు. ఘటోత్సవ కార్యక్రమం ముగిసిన క్షణాల్లో భారీ స్థాయిలో బాణసంచా కాలుస్తారు.



పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం



ఆలయంలో అమ్మవారి ఘటాలు



జాతరలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

● ఆలయంలో ఏర్పాట్లు..

మంగళవారం రోజంతా ఆలయానికి భక్తుల తాకిడి ఉంటుంది. ఈమేరకు రాజాం టౌన్ సి.ఐ. అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాజకీయ ప్రముఖులను ఆలయం కుడిభాగం నుంచి లోపలకి పంపించేలా.. మరికొంత మంది పట్టణ ప్రముఖులు, తదితరులను ఆలయ వెనుక భాగం నుంచి దర్శనానికి వెళ్లేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.100 టికెట్ కొనుగోలు చేసిన భక్తులు ఇక్కట్లకు గురికాకుండా త్వరితగతిన అమ్మవారి దర్శనం చేసుకునేలా చేపట్టాల్సిన చర్యలపై ఈఓ మాధవరావు, ఎస్వీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు సలాది తులసీదాస్, కమిటీ సభ్యులు పొట్నూరు లక్ష్మణరావు, గోపి, వెంపల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయించారు. రూ.10, రూ.50 టికెట్లు కొనుగోలు చేసిన భక్తుల కోసం ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేశారు.

● నేడు, రేపు ట్రాఫిక్ ఆంక్షలు..

మంగళ, బుధవారాలలో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించామని సి.ఐ. అశోక్ కుమార్ తెలిపారు. బొబ్బిలి. తెర్లాం, సాలూరు తదితర ప్రాంతాల నుంచి రాజాం వైపు వచ్చే భారీ వాహనాలు చీకటిపేట జంక్షన్ నుంచి బొమ్మినాయుడు వలస, ఎం.జె.వలస, జి.సి.పల్లి, జెండాలదిబ్బ మీదుగా రాజాం వచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు. రాజాం నుంచి బొబ్బిలి, సాలూరు, తెర్లాం తదితర ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనాలు ఈ మార్గంలోనే వెళ్లాల్సి ఉందన్నారు. ఆ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు చీకటిపేట జంక్షన్ నుంచి ఇల్లంనాయుడువలస, మారేడుబాక, కొత్తవలస మీదుగా రాజాం చేరుకోవలసి ఉంటుంది. భక్తులు సహకరించాలని సి.ఐ. అశోక్‌కుమార్ కోరారు.

రైతులకు మ్యుటేషన్ కష్టాలు

● వారసుల పేరు మీద వివరాల మార్పునకు అవస్థలు

విజయనగరం కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గంట్యాడ మండలం సిరిపురం గ్రామానికి చెందిన బి.సత్యనారాయణ, శ్రీనుల తండ్రి మరణించడంతో వారసత్వంగా వచ్చిన భూమిని వారి ఇరువురి పేరున మార్పు చేయడానికి దరఖాస్తు చేసుకోవడానికి వెళ్లారు. ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ (ఎఫ్ఎంసి)లో సత్యనారాయణ, శ్రీను పేర్లు ఉన్నాయి. ఇద్దరి పేర్లు ఉండటంతో ఒకేసారి ఇద్దరి పేరున మ్యుటేషన్ పెట్టే ఆప్షన్ మీసేవలో గానీ, సచివాలయంలో గానీ లేదు. దీంతో ఒక్కరి పేరున మ్యుటేషన్ చేయించాల్సి వచ్చింది. ఆయన పేరు మీదకు భూమి మారిన తరువాత రెండో వ్యక్తి మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి. దీంతో రెండో వ్యక్తి మ్యుటేషన్ పెట్టుకోవడానికి కనీసం 45 రోజుల పాటు వేచి ఉండాలి. ఇలాంటి పరిస్థితిలో రెండో వ్యక్తికి అవస్థలు తప్పడం లేదు.

...ఈ సమస్య వీరిదే కాదు. జిల్లా వ్యాప్తంగా అనేక మంది ఇటువంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. తండ్రుల నుంచి వచ్చిన వారసత్వ ఆస్తిని అన్నదమ్ముల పేరున ఒకేసారి మార్పు చేసుకునే అవకాశం లేకపోవడం వల్ల రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అన్న ఒకసారి, తమ్ముడు మరోసారి మీసేవ కేంద్రాలు, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసినప్పటి నుంచి ఈ సమస్య కొనసాగుతోంది. సచివాలయ వ్యవస్థ లేని సమయంలో తండ్రి నుంచి వచ్చిన ఆస్తిని పిల్లల పేరిట మార్పునకు మీసేవ కేంద్రాల్లో ఒకేసారి దరఖాస్తు చేసుకునే అవకాశం (పోతికేసు) ఉండేది. అన్నదమ్ములు రాసుకున్న పారికత్తుల పంపకం ప్రకారం రెవెన్యూ అధికారులు మార్పు చేసేవారు. వైసీపీ హయాంలో సమస్య రావడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం కూడా ఈ సమస్యపై దృష్టి పెట్టకపోవడం వల్ల రైతులకు ఇబ్బంది తప్పడం లేదు. కొనుగోలు చేసుకున్న భూమికి సంబంధించి మ్యుటేషన్‌కు సమస్య లేదు. ఎఫ్ఎంసీ వచ్చేసరికి సమస్య వెంటాడుతోంది. ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్‌లో ఎంత మంది అన్నదమ్ములు ఉన్నా... అందరి పేరునా మ్యుటేషన్ కోసం పెట్టుకునే విధంగా ఏపీ సేవా పోర్టల్‌ను మార్పు చేస్తేగానీ ఈ సమస్యను పరిష్కరించడం కష్టమని రెవెన్యూ అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటే రైతులకు మేలు జరుగుతుంది.

ఘనంగా వీరభద్రుని ప్రభ ఊరేగింపు

● భారీగా తరలివచ్చిన భక్తులు

సాలూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామదేవత శ్యామలాంబ అమ్మవారి ఉత్సవంలో భాగంగా మెంటాడ వీధి వాసులు సోమవారం వీరభద్రుని ప్రభ చెట్టును ఘనంగా ఊరేగించారు. పట్టణంలో ఉన్న వేణుగోపాల స్వామి ఆలయ సమీపం నుంచి భక్తి శ్రద్ధలతో చెట్టును తీసుకువచ్చారు. పూజారి జాడ మహేష్‌తో పాటు మెంటాడ వీధి పెద్దలు తొలి పూజ చేశారు. అనంతరం మహిళలు ముగ్గులు, పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. మేళతాళాలు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ వీరభద్రుని ప్రభ ఎద్దుల సాయంతో వేణుగోపాల స్వామి ఆలయం నుంచి మెయిన్ రోడ్డు, డబ్బీ వీధి, పెద కోమటిపేట, కోటవీధి మీదుగా మెంటాడ వీధికి చేరుకుంది. దారి పొడవునా భక్తులు చెట్టుకు పూజలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పట్టణ సీఐ అప్పలనాయుడు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్కేన అప్పారావు, ప్రధాన కార్యదర్శి నిమ్మాది తిరుపతిరావు (చిట్టి), మండల ఈశ్వరరావు, కొనిసి చిన్ని, పప్పల మోహన్‌రావు, కౌన్సిలర్ కొనిసి వరలక్ష్మి, బృందావనం అశోక్, అప్పికొండ శంకరరావు, రౌతు చిన్నయ్యతో పాటు స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రభ చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు



ఎద్దుల సాయంతో ప్రభ చెట్టును తరలిస్తున్న మెంటాడ వీధి ప్రజలు

అర్జీలను త్వరగా పరిష్కరించండి: 'మన్యం' కలెక్టర్



వినతులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 136 వినతులను స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ప్రతి అర్జీపైనా పారదర్శకంగా విచారణ చేపట్టి...గడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ, ఇన్‌చార్జి జేసీ కె.హేమలత పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విరాళంగా అందించిన సంచార ఎక్స్‌రేమిషన్ యూనిట్‌ను ప్రారంభించారు. అలాగే పార్వతీపురంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహానికి సీఎస్ఆర్ కింద నాలుగు బీరువాలు, నాలుగు టేబుళ్లు, నాలుగు విజిటింగ్ చైర్స్, 20 కుర్చీలను యూనియన్ బ్యాంకు సమకూర్చింది. తన కార్యాలయ ప్రాంగణంలో సోమవారం జరిగిన ఫర్నీచర్ వితరణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.

చిరుద్యోగులపై రాజకీయ కక్షలు వద్దు

బెలగాం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చిరుద్యోగులపై రాజకీయ కక్షలు ఆపాలని... తొలగించిన మధ్యాహ్న భోజన కార్యకర్తలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ జిల్లాలో అనేక చోట్ల మధ్యాహ్న భోజన కార్మికులు, వీవోఏలను రాజకీయ కక్షతో తొలగించారని ఆరోపించారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

శాసనసభలో మన వాణి

జొన్నవలసలో వసతి గృహానికి శాశ్వత భవనం

● విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



విజయనగరం రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తన నియోజకవర్గ పరిధిలోని ఏడు వసతి గృహాల్లో కొన్నింటికి మరమ్మతులు, మరికొన్నింటికి శాశ్వత భవనాలు మంజూరు చేయడం హర్షణీయమని విజయనగరం ఎమ్మెల్యే అదితిగజపతిరాజు అన్నారు. జొన్నవలసలోని వసతి గృహానికి మరమ్మతులు చేసినా వినియోగంలోకి రాదని, ఈ నేపథ్యంలో శాశ్వత వసతి గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేయా లని సోమవారం అసెంబ్లీలో ఆమె ప్రస్తావించారు. గత ప్రభుత్వం ప్రభుత్వ బాలికల హైస్కూల్‌ను మూసి వేసిందని సభ దృష్టికి తీసుకొచ్చారు. నియోజకవర్గ పరిధిలో అంగన్‌వాడీ భవనాలు పూర్తి చేయడానికి సహకరించాలని కోరారు. నగరంలోని ఘోషాసుపత్రిలో సౌకర్యాలు మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు.

మౌలిక సదుపాయాలు లేవు..

● పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



పార్వతీపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా కనీస సదుపాయాలు అందుబాటులో లేవని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అసెంబ్లీలో సోమవారం ప్రస్తావించారు. జిల్లాలోని పోలీసు, రెవెన్యూ వ్యవస్థలో కనీస వసతులు కొరవడినందున ప్రజలకు, అధికారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రెవెన్యూ శాఖలో 8 తహసీల్దారు పోస్టులు భర్తీ చేయనందున ఇన్‌చార్జిలతోనే పాలన కొనసాగుతోందన్నారు. ఎస్పీ కార్యాలయం, బంగ్లాలకు భవనాలు లేకపోవడంతో మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారులు వచ్చిన సమయంలో వసతి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోలీసు శాఖలో ఖాళీలను భర్తీ చేయకపోవడంతో విధులు సక్రమంగా నిర్వహించలేకపోతున్నారన్నారు. కలెక్టర్ కార్యాలయాన్ని ఐటీడీఏలోనే నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా డీసీసీబీని, జిల్లా పరిషత్‌ను విభజించలేదని సభ దృష్టికి తెచ్చారు.

అటవీ అనుమతులు లేక.. పనుల్లో జాప్యం

● కురుపాం ఎమ్మెల్యే, విప్ జగదీశ్వరి



గుమ్మలక్ష్మీపురం/జియ్యమ్మవలస/కొమరాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అటవీ అధికారులు సకాలంలో అనుమతులు ఇవ్వనందున కొండశిఖర గ్రామాలకు రహదారి నిర్మాణ పనులు జరగడం లేదని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. అసెంబ్లీలో సోమవారం ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వంలో రహదారుల నిర్మాణాలే లేవని... కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొండ శిఖర గ్రామాలకు కోట్లాది రూపాయలను రహదారుల నిర్మాణానికి కేటాయించారని చెప్పారు. ఈ పనులు చేయడానికి సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల అనుమతులు లేవని చెబుతూ అడ్డుపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి అటవీ శాఖ నుంచి అనుమతులు వచ్చేలా చూడాలన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి గిరిజన నిధులను తన సొంత ఇంటి ప్రహరీ నిర్మాణానికి ఖర్చు చేశారని జగదీశ్వరి ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో గిరిజనుల కోసం 8,158 కోట్లు కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఐటీడీఏలోని ఉద్యోగాలను గిరిజనులకే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. జీసీసీ ద్వారా గిరిజనుల నుంచి కొనుగోలు చేస్తున్న ఉత్పత్తులకు వ్యాట్ మినహాయింపు ఇవ్వాలని కోరారు. గురుకుల పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ట్రైకార్ రుణాలు మంజూరు చేయడం, కాస్మెటిక్ చార్జీలు ఇవ్వడంతో తమ ప్రభుత్వాన్ని ప్రశంసిస్తున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు.

నిరసనలతో దద్దరిల్లిన కలెక్టరేట్

విజయనగరం కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ సోమవారం నిరసనలతో దద్దరిల్లింది. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ వివిధ సంఘాలు కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు చేపట్టాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు, రైతు సంఘ నాయకులు, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు ధర్నాలు చేశారు.

కనీస వేతనాలు అమలు చేయాలని అంగన్‌వాడీలు..

కనీస వేనతనాలు అమలు చేయాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. సంఘ నాయకులు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున అంగన్‌వాడీ కార్యకర్తలకు తీపి కబురు అని చెప్పి మోసపూరిత గ్రాట్యూటీ జీవో ఇచ్చారని మండిపడ్డారు. అనంతరం కలెక్టరేట్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. ఆందోళనలో సీపీఎం జిల్లా కార్యదర్శి టి.సూర్యనారాయణ, సీఐటీయూ నాయుకులు శంకరరావు, సుధారాణి, జగన్మోహనరావు, టీవీ రమణ తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్ రద్దుకు డిమాండ్..

గుర్ల మండలం అచ్యుతాపురం వద్ద వేదాంత మల్టీ నేషనల్ వాహనాల ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్‌ను రద్దు చేయాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద కనకదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలి పారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయుకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్‌ను రద్దు చేయాలని ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ధర్నా

రైతులకు భూములు ఇవ్వాలి..

విశాఖపట్టణం జిల్లా పెందుర్తి నుంచి బొడ్డవరం వరకూ నిర్మాణం చేయనున్న ఎన్‌హెచ్ 516-బి రహదారికి భూములు కోల్పోయిన రైతులకు గజాలు ప్రకారం పరిహారం చెల్లించాలని రైతు సంఘం నాయుకులు డిమాండ్ చేశారు. రైతు సంఘం అధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలె రైతు సంఘం నాయకుడు రాంబాబు తదితరులు ఉన్నారు.



ఎస్‌ఐని సస్పెండ్ చేయాలని విశ్వహిందూ పరిషత్ ధర్నా

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి..

అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈనెల 4 జరిగిన వీరభద్రస్వామి ఆలయ పార్వేటి ఉత్సవం సందర్భంగా హిందువులపై దాడికి పాల్పడ్డ ముస్లింలను అదుపు చేయడంలో పోలీసులు విఫలమయ్యారని విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆరోపించారు. కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయా నాయకులు మాట్లాడుతూ.. ఆ ఘటనలో హిందువులపై తప్పుడు కేసులు పెట్టిన ఎస్‌ఐను వెంటనే సస్పెండ్ చేయాలని కలెక్టరుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు, బీజేపీ నాయకులు ఉన్నారు.

15తో ముగియనున్న షుగర్స్ క్రషింగ్ సీజన్

రేగిడి, మార్చి 10, (ఆంధ్రజ్యోతి): మండలంలో సంకిలి ఈఐడీ ప్యారీ షుగర్స్ ఈ ఏడాది క్రొషంగ్ సీజన్ మార్చి 15తో ముగియునుందని యాజమాన్య వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించాయి. ఈ ఏడాది 3.50 లక్షల మెట్రిక్ టన్నుల క్రషింగ్ లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 3.37 లక్షల మెట్రిక్ టన్నుల గానుగ పూర్తిచేశామన్నారు. మిగిలిన 13 వేలు మెట్రిక్ టన్నులు గానుగ చేస్తామన్నారు. ఇంకా మిగిలిన చెరకును క్రషింగ్‌కు సకాలంలో రైతులు కర్మాగారానికి తరలించి సహకరించాలని యాజమాన్య ప్రతినిధులు రమేష్, కమల్ విజ్ఞప్తి చేశారు.

పలువురికి పురస్కారాలు

రాజాం/ రూరల్ మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాజాంలో పోలిపల్లి పైడితల్లి అమ్మ వారి జాతర సందర్భంగా పలువురికి సోమవారం పురస్కారాలను అందజేశారు. రాజాం ప్రతిష్ఠను పలురాష్ట్రాలలో ఇనుమడింపజేసిన దివంగత రంగస్థల కళాకారుడు అమరాపు సత్యనారాయణ అవార్డును ఆర్నిపల్లి వెంకట నాయుడుకు, చీకటి రామారావు అవార్డును మెట్ట దామోదరరావులకు తహసీల్దారు కృష్ణంరాజు, మునిసిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, సలాది వెంకటరమణ కళాపరిషత్ అధ్యక్షుడు సలాది తులసీదాస్ ప్రదానం చేశారు.

మహిళా ఏకపాత్ర పోటీల విజేత 'కుమారి'

రాజాం/ రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాజాంలో పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా సలాది వెంకటరమణ కళాపరిష్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మహిళా ఏకపాత్రాభినయ పోటీలు జరిగాయి. హరిశ్చంద్ర నాటకం లోని కాటిసీను ఏకపాత్రకు ప్రథమ బహుమతిగా బండి కుమారి, హరిశ్చంద్ర నాటకంలో చంద్రమతి అరణ్యసీనుకు ద్వితీయ బహుమతి చింతాడ గోవిందమ్మ, చంద్రమతి కాటిసీనుకు బి.దుర్గాకళ్యాణి తృతీయ బహుమతి సాధించారు. విజేతల కు నగదు ప్రోత్సాహకాలను పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు సలాది తులసీదాస్, ఆర్నిపల్లి వెంకటనాయుడు అందజేశారు.

'వైద్యశాఖ నిర్లక్ష్యంతోనే తట్టువ్యాధి'

శృంగవరపుకోట రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మాయం అయిపోయిందనుకున్న తట్టు వ్యాధి (మీజిల్స్) తిరిగి దారపర్తి, బొడ్డవర పంచాయతీలోని గిరిజన గ్రామాల్లో చిన్నారులకు వ్యాపించడం చాలాభయంగా ఉందని గిరిజన ఆదివాసీ యువత ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. కేవలం వైద్యశాఖ నిర్లక్ష్యం వల్ల తట్టు వ్యాధి వ్యాప్తి చెందుతోందన్నారు. గిరిజన బాలుర పాలిట శాపంగా మారిందన్నారు. దీనికి కారకులైన వారిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై శాసనసభలో ఎమ్మెల్యే ప్రస్తావించాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలకు ఎక్స్‌లో పోస్టు చేస్తామని యువకులు తెలిపారు.

సదుపాయాలు కల్పించండి

గజపతినగరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దళితవాడల్లో పూర్తి స్థాయిలో వసతుల కల్పనకు అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.శ్రీనివాస్ అన్నారు. సోమవారం సీపీఎం ప్రజాచైతన్య యాత్రలో భాగంగా మండలంలోని బంగారమ్మపేటలోని దళిత కాలనీలో సమస్యలను గుర్తించారు. వాటిని పరిష్కరించాలంటూ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టి.కృష్ణ, ఈశ్వరమ్మ, గౌరమ్మ, రాము పాల్గొన్నారు.

గుర్రపు పందెం విజేత తలారి

లక్కవరపుకోట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్యాడ తలారి అచ్చిమాంబ తీర్థ మహోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన గుర్రపు పందెంలో పోటీలో తలారీ సింగపూర్ సత్యనారాయణ విజేతగా నిలిచారు. 12 గుర్రాలు పందెంలో పాల్గొనగా తలారి గుర్రం మొదటి స్థానంలో నిలిచింది. విజేతలకు గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు.

శివపార్వతులకు కల్యాణోత్సవం

గజపతినగరం మార్చి10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగచోళ్లపెంటలో గల సత్యజ్ఞానానంద ఆశ్రమంలోని శివాలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏటా ఐదు రోజులు పాటు ఇక్కడ కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయతీ. ఆశ్రమపీఠాధిపతి జ్ఞానానంద భారతి స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అన్నసమారాధన చేశారు.

వినతులు కచ్చితంగా పరిష్కరించాలి

● కలెక్టరు అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్ మార్చి 10 (ఆంధ్రజ్యోతి) ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో అందిన వినతులను ఖచ్చితంగా పరిష్కరించాలని అధికారులను కలెక్టరు అంబేడ్కర్ ఆదేశించారు. ఒకవేళ పరిష్కారం కాకపోతే అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ మొక్కుబడిగా ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

ఎండల నుంచి ఉపశమనానికి చర్యలు చేపట్టండి

రానున్న రోజుల్లో ఎండలు మరింత తీవ్రవయ్యే అవకాశం ఉందని కలెక్టర్ అన్నారు. దీన్ని దృష్టిలో వుంచుకుని ప్రజలకు ఎండలు తీవ్రత నుంచి ఉపశమనం కలిగించేందుకు అవసరమన అన్ని చర్యలు తీసుకోవాలని అఅధికారులను ఆదేశించారు. ముఖ్యమైన కూడళ్లల్లో చలివేంద్రాలు ఏర్పాటు, నీడనిచ్చే షెల్టర్లు ఏర్పాటు, పశువులకు తాగునీటి సరఫరా, పని ప్రాంతాల్లో షామియానాలు, ప్రాథమిక చికత్స కేంద్రాలు వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టరు మురళి, ప్రమీలాగాంధీ తదితరులు ఉన్నారు.

అర్జీదారులతో కిటకిటలాడిన కలెక్టరేట్

విజయనగరం కలెక్టరేట్ మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దాదాపు రెండు నెలలు తరువాత సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యలు పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. కలెక్టర్ అంబేడ్కర్, ఇన్‌చార్జి జేసీ శ్రీనివాసమూర్తి, కేఆర్‌సీసీ ఎస్‌డీసీ మురళి 231 వినతులు స్వీకరించారు.

పరిష్కార వేదికకు 37 ఫిర్యాదులు

విజయనగరం క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 37 ఫిర్యాదులను ఎస్పీ వకుల్ జిందాల్ స్వీకరించారు. సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి, చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలన్నారు. తీసుకున్న చర్యలపై ఏడు రోజులో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కె చౌదరి, ఎస్‌ఐ రాజేశ్ పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవాలు

నెల్లిమర్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలో నిర్మించిన వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం ప్రారంభోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 12న ఉదయం కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని నిర్వహించనున్నారు. తొలిరోజు శిలామూర్తులకు వేదపండితులు పూజాదికాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు చంద్రమౌళి కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో రుత్వికులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిదులు అశోక్‌కుమార్, కొత శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా ఎల్లమాంబ జాతర

గజపతినగరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మరుపల్లిలో సోమవారం ఎల్లమాంబ జాతర ఘనంగా నిర్వహించారు. ఘణంగా జరిగింది. గ్రామంలోని ఎల్లమాంబ, పరుశురాముల ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సిరిమానోత్సవానికి సంబంధించి తరతరాలుగా అమ్మవారి పూజారులుగా వ్యవహరిస్తున్న రుద్రాక్షుల, కర్నకోట వంశీయులు సిరిమాను అధిరోదించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ లెంక రామలక్ష్మి ఏర్పాట్లు చేశారు. స్వచ్ఛంద సంస్థలు ఆలయాల వద్ద ప్రసాద వితరణ చేశారు అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ రమణ బందోబస్తును ఏర్పాటు చేశారు.



అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు, సిరిమానుపై పూజారి

సమస్యలకు శాశ్వత పరిష్కారం

శృంగవరపుకోట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేయడంతో పాటు ఇచ్చిన వాగ్దానాలను నేరవేరుస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. సోమవారం స్థానిక దేవి ఆలయంలో అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. పూజల అనంతరం గాదెను ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయానికి దోహదపడిన ఉపాధ్యాయులందరికి రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో కె.వి.రమణ, ఎంఈవోలు నరసింగరావు, లీక్ష్మి, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు ఇందుకూరి అశోక్‌రాజు, కె.మోహన్‌రాజ్, కె.సురేష్, తమటపు అప్పారావు, కె.బంగారునాయుడు ఉన్నారు.



ఎమ్మెల్సీ గాదెను సత్కరిస్తున్న నాయకులు

సాధారణ ప్రసవాలపై దృష్టి సారించండి

గజపతినగరం మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సాధారణ ప్రసవాలపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్య సిబ్బందిని డీఎంహెచ్‌వో జీవనరాణి ఆదేశించారు. సోమవారం మండలంలోని మరుపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో వైద్యసేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాయికృష్ణ ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

జాతరను పరిశీలించిన నాయకులు

రాజాం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాజాంలో పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరను సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేశ్వర్మ, టీడీపీ సీనియర్ నాయకుడు కోండ్రు జగదీశ్ తదితరులు పరిశీలించారు. సోమవారం రాత్రి నిర్వహించే ఈవెంట్ ఏర్పాట్లను ప్రత్యక్షంగా చూశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వంగా వెంకటరావు, కోటగిరి నారాయణరావు, జొన్నాడ రంజిత్, గుడివాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

మద్యం దుకాణం వద్దంటూ మహిళల బైఠాయింపు

సంతకవిటి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి); మండలంలోని వాసుదేవపట్నం పంచాయతీ పరిధిలో పోతలజోగు పేటలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ సోమవారం మహిళలు ఆందోళనకు దిగారు. స్థానికంగా మద్యం దుకాణం ఏర్పాటుకు ఎస్.కోట మండలానికి చెందిన జి.పావని లాటరీలో అవకాశాన్ని దక్కించుంది. మద్యం దుకాణం ఏర్పాటుకు సిద్ధం కావడంతో మహిళలు, గ్రామస్థులు ఇక్కడ దుకాణం ఏర్పాటు చేయవద్దని అక్కడే బైఠాయిం చారు. ప్రజల అంగీకారం లేకుండా ఎలా దుకాణం ఏర్పాటు చేస్తారని నిలదీశారు.



దుకాణం ఎదుట బైఠాయించిన మహిళలు

భూముల క్రమబద్ధీకరణకు ఆదేశాలు

రాజాం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం విధివిధానాలు ఖరారు చేస్తూ రెవిన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారని తహసీల్దార్ కృష్ణంరాజు తెలిపారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం 2025 పేరుతో భూముల క్రమబద్ధీకరణ చేపడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2019 అక్టోబరు 15ను కటాఫ్ డేట్‌గా తీసుకుందని ఆ తేదీ కంటే ముందు ఆక్రమించిన వారికే నిబంధనలు అనుసరించి భూములను క్రమబద్ధీకరించే అవకాశం ఉందన్నారు.

గిరిశిఖర గ్రామాల్లో..

సదుపాయలపై మండలిలో ప్రశ్నిస్తా..

● ఆంధ్రజ్యోతి కథనాలపై స్పందించిన ఎమ్మెల్సీ రఘురాజు ● గిరిశిఖర గ్రామాల్లో పర్యటన

శృంగవరపుకోట రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా 'ఆంధ్రజ్యోతి'లో గిరిశిఖర గ్రామాల్లో జ్వరాలు, చిన్నారులకు అందని టీకాలు, సరైన వైద్యసేవలు అందించని వైద్యులు, సిబ్బంది తదితర విషయాలపై పలు కథనాలు ప్రచురితమయ్యాయి. కొద్దిరోజులుగా ప్రచురితమవుతున్న కథనాలను పరిశీలించిన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శాసన మండలి సమావేశాలు ముగించుకుని వచ్చి గిరిశిఖర గ్రామాలపై దృష్టిసారించారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం గిరిశిఖర గ్రామమైన పల్లపు దుంగాడును సందర్శించారు. అక్కడ గిరిజన కుటుంబాలతో కలిసి మాట్లాడారు. వారి బాగోగులు అడిగితెలుసుకున్నారు. తమకు వచ్చిన జ్వరాలు, టీకాల విషయంతో పాటు గడిచిన పది రోజులుగా వైద్యసిబ్బంది సేవలు వివరించారు. అయితే తమ గ్రామాలకు వైద్యుడు, ముఖ్య సిబ్బంది కాకుండా ఏఎన్ఎంలు, ఆశాలు మాత్రమే వస్తున్నారని తెలిపారు. జ్వరాలు, టీకాలు విషయం పేపర్లలో వచ్చాక వైద్యులు వస్తున్నారని వీరు ప్రతి 15 రోజులకు తమ గ్రామాలకు వచ్చే ఏర్పాట్లు చేయాలని కోరారు. గిరిశిఖర గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనపై శాసనమండలిలో ప్రస్తావిస్తానన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్సీ పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న వైద్య సిబ్బందిని పిలిచి టీకాలు వేయని విషయంపై ఆరా తీశారు. ఎంఎల్‌హెచ్‌పీ, డాక్టర్ విశాఖ నుంచి రావడం కరెక్ట్ కాదని, ఇక్కడ పనిచేస్తున్న వారు స్థానికంగా ఉండాలన్నారు. వైద్యులు, సిబ్బంది పనితీరు మార్చుకుని సేవలు అందించాలని సూచించారు.



గిరిజనులు, వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

ఇంటికి చేరుకుంటామన్న కొద్ది నిమిషాల్లో..

● లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

క్రైం న్యూస్

గరుగుబిల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ఇంటికి చేరుకుంటామన్న కొద్ది నిమిషాల్లో సోమవారం తెల్లవారుజామున సుంకి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. తెల్లవారుజాము కావడంతో మంచు కురవడంతోపాటు మలుపు మార్గంకావడంతో కారును లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గుమ్మ లక్ష్మీపురం సమీపంలోని గుమ్మ గ్రామానికి చెందిన మండంగి హరిప్రసాద్ (29) బంధువులను పార్వతీపురం రైల్వేస్టేషన్‌లో దించి కూరగాయలు కొనుగోలు చేసి కారులో గ్రామానికి బయలు దేరాడు. గరుగుబిల్లి మండలంలోని సుంకి సమీపంలో వచ్చేసరికి మలుపు వద్ద తెల్లవారు జాము కావడంతో మంచు కురుస్తోంది. అదే సమయంలో పాలకొండ నుంచి జేకే పేపర్ మిల్లుకు కర్రల లోడుతో లారీ వస్తోంది. మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారును లారీ ఢీ కొంది. దీంతో కారును నడుపుతున్న హరిప్రసాద్ ఘటన స్థలంలోనే మృతి చెందగా, కారులో ఉన్న గాయపడిన గౌరీశంకర్, బి.శ్రీనులను 108లో పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. హరి ప్రసాద్‌కు వివాహమై ఆరు నెలలు కావస్తోంది. వివాహమైన కొద్ది నెలల్లోనే మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మరో 30 నిమిషాల్లో ఇంటికి చేరుతాడనుకున్న సమయంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఘటనా స్థలిని గరుగుబిల్లి ఎస్ఐ పి.రమేష్‌నాయుడు, హెచ్‌సీ ఎ.బాబ్జీరావు పరిశీలించి కేసు నమోదు చేశారు.



హరిప్రసాద్ (ఫైల్)

పోక్సో కేసులో వ్యక్తికి 20 ఏళ్ల జైలు

బెలగాం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పోక్సో కేసులో ఓ వ్యక్తికి విజయనగరం పోక్సో స్పెషల్ కోర్టు న్యాయాధికారి కె.నాగమణి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.13 వేలు జరిమానా విధించినట్లు ఎస్పీ మాధవరెడ్డి ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. ఎస్పీ కథనం మేరకు.. కొమరాడ మండలంలోని విక్రంపురానికి చెందిన కోరాడ రామారావు ఓ పాఠశాల వద్ద బస్సు కోసం ఎదురు చూస్తున్న మహిళకు తన వాహనం ఎక్కించుకుని అపహరించాడు. పలు చోట్లకు తీసుకెళ్లి, అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు మేరకు 2023లో కేసు నమోదు కావడంతో పోలీసుల దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువుకావడంతో రామారావుకు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.13 వేలు జరిమానా విధిస్తూ విజయగనగరం పోక్సో స్పెషల్ కోర్టు న్యాయాధికారి తీర్పు వెల్లడించారని తెలిపారు.

ఉత్తరావల్లిలో రెండు ఇళ్లు దగ్ధం

మెరకముడిదాం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉత్తరావల్లిలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు ఇళ్లు దగ్ధమయ్యాయి. చాపెన గౌరమ్మ, గొర్లె శ్రీరాములు ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. ప్రమాద సమయంలో ఇంట్లో వారంతా ఉపాధి పనులకు వెళ్లడంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. బాధిత కుటుంబాలను తహసీల్దారు అజూరఫీ జాన్ పరామర్శించారు. తక్షణ సాయంగా వారికి 10 కేజీల బియ్యం పంపిణీ చేశారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్టు

శృంగవరపుకోట మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడు కె.శ్యామ్‌ను శృంగవరపుకోట పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ వి.నారాయణమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2023 మే నెలలో హోండా సిటి కారులో 60 కేజీల గంజాయిను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఆ కేసులో అల్లూరి సీతారామరాజు జిల్లా డుబ్రిగూడ గ్రామానికి చెందిన కె.శ్యామ్ ప్రధాన నిందుతుడు. అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్న శ్యామ్‌ను సోమవారం ఉదయం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): భోగాపురం మండలం లింగాలవలస పరిధిలో మద్యం విక్రయిస్తున్న బాడితబోయిన బంగారిని అరెస్టు చేసి, అతడి నుంచి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రాజశ్రీ తెలిపారు. అనంతరం భోగాపురం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించామన్నారు. దాడుల్లో హెచ్‌సీ సుదర్శన్‌కుమార్, ఈసీలు రాము, జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

సారా అమ్మితే సంక్షేమం కట్

మెంటాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సారా అమ్మితే ప్రభుత్వ సంక్షేమ పథకాలను రద్దు చేస్తామని గజపతినగరం ఎక్సైజ్ సీఐ జె.జనార్దనరావు హెచ్చరించారు. నవోదయం 2.0 లో భాగంగా మండలంలోని వానిజ గ్రామంలో సారాపై ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. సారా వల్ల తలెత్తే అనర్థాలను వివరించారు. రెండోసారి సారాతో పట్టుబడితే తహసీల్దార్ సమక్షంలో రూ.2 లక్షలు జరిమానా విధిస్తామన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, డ్వాక్రా సంఘం అధ్యక్షురాలు, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్, స్థానిక యువజన నాయకుడితో కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మహ్మద్ జె.బాషా, ఎ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సామగ్రి స్వాధీనం

నెల్లిమర్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ అధికారులు సోమవారం మెయిద జంక్షన్‌లో పలు షాపులపై దాడులు చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి డి.భాస్కర్, శానిటరీ కార్యదర్శులు 10 కేజీల ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యాపారులకు రూ.2వేలు అపరాధరుసుం విధించారు.

గుర్ల గెడ్డను పూర్తిచేయండి

మెంటాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్లగెడ్డ మినీ రిజర్వాయర్ పూర్తయ్యేలా చూడాలని పలువురు నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. అనంతరం తహసీల్దారు కోరాడ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఈ రిజర్వాయర్ పనులు అసంపూర్తిగా నిలిచాయన్నారు. వైసీపీ ప్రభుత్వం పనుల పూర్తికి హామీతో సరిపెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి రైతులను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చలుమూరి వెంకట్రావు, జి.అన్నవరం, రెడ్డి ఆదినారాయణ, రెడ్డి రాజప్పలనాయడు, కౌలు రైతులు సంఘం రాములు, లక్ష్మణరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

గ్రాట్యుటీ చెల్లింపునకు చర్యలు తీసుకోండి

నెల్లిమర్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ జూట్ కార్మికుల గ్రాట్యుటీ చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ జూట్ కార్మికులు తహసీల్దార్ సుదర్శనరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లిమర్ల జూట్‌మిల్ యాజమాన్యం గ్రాట్యుటీ చెల్లించాలని కోరుతూ 20 మంది కార్మికులు కోర్టులో కేసు వేసి జిల్లా ఎపీఎల్‌ని ఆశ్రయించగా ఇందులో 10 మందికి గ్రాట్యుటీ చెల్లించాలని ఆయన ఆదేశించారని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ జూట్ కార్మికులు బి.అప్పలనరసమ్మ, ఎస్.అప్పారావు, పి.అప్పడు, పి.సత్యనారాయణ, జి.గురునాయుడు, ఎల్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిర్బంధం దుర్మార్గం

నెల్లిమర్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల అక్రమ అరెస్టు, గృహ నిర్బందం దుర్మార్గమని సీఐటీయూ నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చలో అమరావతి కార్యక్రమానికి వెళుతున్న వారిని అక్రమంగా అరెస్టు చేసి గృహ నిర్బంధం చేయడం దుర్మార్గమన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చి ఇప్పుడు వారిని అక్రమంగా అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. గతంలో అంగన్‌వాడీల మీద టీడీపీ ప్రభుత్వం చేసిన దాడి మరచిపోలేదని తగిన బుద్ధి చెబుతారని సీఐటీయూ నాయకులు రామారావు గుర్తు చేశారు.

తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రాలు

శృంగవరపుకోట రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చలో విజయవాడ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు సోమవారం తెరుచుకోలేదు. దీంతో చిన్నారులకు పౌష్టికాహారం అందలేదు.

సమస్యల పరిష్కారానికి చర్యలు: భూదేవి



వినతులు స్వీకరిస్తున్న భూదేవి

పాలకొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి తెలిపారు. సోమవారం స్థానిక టీడీపీకార్యాలయంలో సమస్యలపై వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఖండాపు వెంకటరమణ, వారాడ సుమంత్‌నాయుడు, గుమ్మడి సింహాద్రి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పాలకొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గారమ్మకాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నాయకులు ఎం.తిరుపతిరావు, దావాల రమణారావు, కె.రాము, డి.దుర్గారావు డిమాండ్ చేశారు.సోమవారం పట్టణంలోని గారమ్మకాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15 రోజుల్లోగా సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

'యువతపోరు' పోస్టర్ ఆవిష్కరణ

పాలకొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో తలపెట్టిన యువత పోరు పోస్టర్‌ను పాలకొండలో ఎమ్మెల్సీ పాలసవలస విక్రాంత్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, వైసీపీ నాయకులు రౌతు హనుమంతురావు, వెలమల మన్మథరావు, నీలాపు శ్రీనివాసరావు, దుంపల చిన్ని, సర్పంచ్ ఉపేంద్ర పాల్గొన్నారు.

ఈశ్వరాలయ నిర్మాణానికి స్థలం వితరణ

పాచిపెంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాతుమూరు గ్రీన్ ఫీల్డ్ రహదారి పక్కన ఉన్న 20 సెంట్లు జిరాయితీ భూమిని ఈశ్వరాలయం నిర్మాణానికి ఆ గ్రామానికి చెందిన నైదాన కుటుంబం విరాళంగా అందజేసింది. స్థల దాత నైదాన భారతి అభిప్రాయంతోనే లక్షల రూపాయలు విలువ చేసే స్థలాన్ని ఆలయ నిర్మాణానికి అప్పగించామని భారతి తనయుడు, హైకోర్టు లాయర్ నైదాన శ్రావణకుమార్ ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. ఇక్కడ ఉన్న ప్రస్తుత ధరల ప్రకారం ఈ స్థలం విలువ రూ.60 లక్షలు వరకు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. ఈ మేరకు సోమవారం విరాళంగా ఇచ్చిన స్థలంలో గ్రామస్థులు నవధాన్యాలు చల్లారు. గ్రామపెద్దల నిర్ణయం మేరకు ఈ ఏడాది మే 9న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి నిర్ణయించారు.

సర్వేపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: ఎంపీడీవో



కొత్తపల్లిలో పీ-4 సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

గరుగుబిల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో పీ-4 సర్వేపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో జి.పైడితల్లి హెచ్చరించారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి, రావుపల్లిల్లో నిర్వహిస్తున్న సర్వే పరిశీలించారు.కార్యక్రమంలో సిబ్బంది జి.కృష్ణప్రసాద్, కులశేఖర్, సాయికుమార్ పాల్గొన్నారు.

పదో తరగతి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేయాలి

పార్వతీపురం, మార్చి10 (ఆంధ్రజ్యోతి): ఏపీ సార్వత్రిక విద్యాపీఠం అభ్యాసకులకు మార్చి 17వ తేదీ నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షల హాల్‌టిక్కెట్లను సంబంధి స్టడీ సెంటర్స్ నుంచి పొందాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టిక్కెట్లను వాట్సాప్ మన మిత్ర లేదా అధికారిక వెబ్‌సైట్‌లో ఈనెల తొమ్మిదో తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

భామిని, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్మన్ గృహాలు నిర్మించేందుకు పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని ఆదివాసీ గిరిజనులు కోరారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ ఎస్.అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతై బూర్జిగూడ, కోటకొండ, కోసింగూడ, బంద్రసింగి, రేగిడి తదితర గ్రామాల ఆదివాసీలకు ఇళ్లు మంజూరైనా, పొజిషన్‌కు దరఖాస్తుచేస్తే ఇవ్వడం లేదని ఆందోళనవ్యక్తం చేశారు. కాగా ఈ మేరకు తహసీల్దార్ హౌసింగ్, రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. ఫారెస్ట్, ఐటీడీఏ అధికారులతో మాట్లాడారు. ఆర్‌వోఎఫ్ఆర్ పరిధి ఉండడంతో హౌసింగ్ ద్వారా 44 మంది లబ్ధిదారుల జాబితా ఐటీడీఏకు పంపించామని, అనుమతి వచ్చిన వెంటనే పొజిషన్ ధ్రువపత్రాలు అందజేస్తామని తెలిపారు.

పట్టాలపై అంబులెన్స్.. త్రుటిలో తప్పిన ప్రమాదం

రాయగడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కొరాపుట్-రాయగడ రైలు మార్గంలో షికరపాయి, బలుమస్కు స్టేషన్ సమీపంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి చెందిన అంబులెన్స్ సోమవారం పట్టాలపై ఇరుక్కుపోయింది.లోకోపైలెట్ అప్రమత్తంగా వ్యవహరించడంతో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. షికరపాయి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రోగులను కంటి ఆపరేషన్ల కోసం కళ్యాణ సింగుపూర్ పంచాయతీ ఆసుపత్రికి తరలిస్తున్న అంబులెన్స్ షికరపాయి స్టేషన్ సమీపంలో పట్టాలపై నిలిచిపోయింది. అదే సమయంలో వస్తున్న గూడ్స్‌రైలు చోదకుడు గమనించిఆపడానికి ప్రయత్నించినా వందమీటర్ల మేర అంబులెన్స్‌ను నెట్టుకుపోయింది. ప్రమాదాన్ని పసిగట్టిన వాహన చోదకుడు, అందులో ఉన్న రోగులు అంబులెన్స్ దిగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న వెంటనే రాయగడ డీఆర్ఎం అమితాబ్ సింఘాల్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.అనంతరం అంబులెన్స్‌ను పట్టాలపైనుంచి తొలగించడంతో యథావిధిగా రైళ్ల రాకపోకలు కొనసాగాయి.

అత్యాచారాలను అరికట్టాలి

రాయగడ,మార్చి 10 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని,వాటిని అరికట్టడంలో మోహన్‌చరణ్ మఝి ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని కాంగ్రెస్ శ్రేణులు ఆరోపించాయి. ఈమేరకు సోమ వారం మహిళలపై అత్యాచారాలను అరికట్టాలని ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని గవర్నర్ పేరిట రాసిన వినతిపత్రాన్ని కార్యాలయంలో అందజేశారు.

ఒడిశా

నిర్వహణ లేక.. సంపద రాక

● చెత్తను కాల్చివేస్తున్న వైనం ● ఇదీ వీరఘట్టం మండలంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పరిస్థితి



నడిమికెల్లలో రోడ్డుపక్కన చెత్తను కాలుస్తున్న దృశ్యం

వీరఘట్టం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్వహణ లేకపోవడంతో నామమాత్రంగా మారాయి. దీంతో వీటి నుంచి సంపద రాకపోవడంతోపాటు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరాయి. కొన్నిచోట్ల అసాంఘిక కార్యకలాపాలకు వేదికలుగా మారుతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కేంద్రాలు నిర్వహించాలని కోరుతున్నా పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామస్థాయిలో నిర్వహణ నీరుగారుతోంది. మండలంలో 34 పంచాయతీలకు గాను 15 పంచాయతీలపరిధిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మాణాలు పూర్తయ్యాయి. తొమ్మిది గ్రామాల్లో నిర్మాణాలు వివిద దశల్లో ఉన్నాయి. ఒక్క వీరఘట్టంలో తప్ప మిగిలిన చోట్ల సేకరించిన చెత్తను గ్రామశివారుల్లో కాల్చివేసి సిబ్బంది చేతులు దులుపుకొంటున్నారు.దీంతో ప్రభుత్వం లక్ష్యం నీరుగారుతోంది. ఈ కేంద్రాల నుంచి పొడి,తడిచెత్త వేరుచేసి వాటి నుంచి కంపోస్టు ఎరువు తయారుచేసి పంట పొలాలకు వినియోగించాలని ప్రభుత్వం భావించింది. దీంతో పంచాయతీలకు కూడా ఆదాయం సమకూరుతుంది.అయితే ఈ కేంద్రాల నిర్వహణపై తక్షణమే అధికారులు పర్యవేక్షించి పూర్తిస్థాయి లో చెత్త నుంచి సంపద తయారీకి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు. కాగా పరిశీలించి గ్రామస్థాయి సిబ్బందికి తగు సూచనలిస్తామని ఎంపీడీవో బి.వెంకటరమణ తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

● పంచాయతీ కార్యదర్శుల సంఘ మండలాధ్యక్షుడు పార్థసారధి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రామభద్రపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆ సంఘ మండలా ధ్యక్షుడు పార్థసారధి కోరారు.ఈ మేరకు ఎంపీడీవో రత్నంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్థసారధి మాట్లాడుతూ పనిభారం వల్ల కార్యదర్శులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వివిధ రకాల సర్వేల వల్ల సెలవు , పండగ దినాల్లో కూడా పనిచేయడంతో పలువురు అ నారోగ్యానికి గురవుతున్నారన్నారు. జాబ్‌చార్టులో లేని పనులు కూడా చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మిస్సింగ్ సిటిజన్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయి సర్వే, వర్క్‌ఫ్రంహోం,సర్వే, హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వే, పి-4 సర్వే, డెత్ రీవెరిఫికేషన్ సర్వే, పీఏసీఎస్ సర్వే, లేథర్ హార్టిసియన్స్ సర్వే, ఎంపీసీఐ లింకింగ్ సర్వే, ఆరేళ్లలోపు పిల్లల మిస్సింగ్ ఆధార్ సర్వే, నాన్ ఏపీ రెసి డెన్షియల్ సర్వే, విలేజ్ ఎసర్ట్స్ సర్వే, విలేజ్ ప్రొఫైల్ సర్వేతో పనిభారం పెరిగిందని తెలి పారు.వీటితోపాటు మరో29 బాధ్యతలు కార్య దర్శులకు అప్పగించడం ఎంతవరకు సమం జసమని ప్రశ్నించారు. ఇంటి,కొళాయి పన్నులు, లైసెన్స్‌ల వసూళ్లు కూడా తమతో చేయిం చడం, సచివాలయసిబ్బంది, రాజకీయ నాయకులతో సమన్వయం తదితర తమ శాఖకు సంబంధంలేని పనులుఅప్పగించడం ఇబ్బంది కలుగుతోందని వాపోయారు. కార్యక్రమం లో పంచా యతీ కార్యదర్శుల సంఘం నాయ కులు బొద్దూరు శ్రీనివాసరావు, శ్రావణ్‌కుమార్, ఆకుల ప్రవీణ్‌కుమార్, బాలకృష్ణ, పొట్టా బంగార్రాజు, ఎ. శ్రీనివాసరావు, అడపా ఈశ్వరరావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావసభ విజయవంతం చేయాలి



వీరఘట్టం: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జనసేన ఈనెల 14న పిఠాపురంలో నిర్వహించే పార్టీ ఆవిర్భావ సభ విజయవంతం చేయాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. ఈ మేరకు సోమవారం మండలంలోని ఎం.రాజపురంలో జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని చలోపిఠాపురం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జానీ, మత్స పుండరీకం, కర్నే సాయిపవన్, ఉదయాన చరణ్, సిరాపునాగరాజు, పురుషోత్తం, దిత్తి గోపాల్, మెడిద సందీప్ పాల్గొన్నారు.

●కురుపాం,మార్చి10(ఆంధ్రజ్యోతి):జనసేన ఆవిర్భావ దినోత్సవం జయప్రదం చేయాలని నియోజకవర్గం ఇన్‌చార్జి కడ్రక మల్లేష్ కోరారు. కురుపాంలో జనసేన మండలాధ్యక్షుడు ఎన్.వంశీ ఆధ్వర్యంలో చలోపిఠాపురం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

●గరుగుబిల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జనసేనఆవిర్భావ దినోత్సవానికి తరలిరావాలని పార్టీ మండలాధ్యక్షులు బోను శివకుమార్ కోరారు. ఖడ్గవలస సముదాయంలో చలో పిఠాపురం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎ.శంకరరావు, కేతిరెడ్డి అశోక్‌కుమార్, రవికుమార్, చంద్రశేఖర్, పి.ధర్మ, వెంకటనాయుడు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: ఎస్పీ



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి ఆదేశించారు. సోమవారం పార్వతీపురంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమం 14 ఫిర్యాదులు అందాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరగతిన దర్యాప్తు చేపట్టి బాధితులకు తగిన న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఎస్సై ప్రకృద్దీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐని సస్పెండ్ చేయాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టిన వీహెచ్‌పీ నాయకులు

బెలగాం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) :అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీరభద్ర స్వామి ఉత్సవాల ఊరేగింపులో భక్తులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, రాయచోటి ఎస్ఐని సస్పెండ్ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం కలెక్టరేట్ వద్ద వీహెచ్‌పీ ఆధ్వర్యంలో దాడికి వ్యతిరేకంగా నిరసన దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా ఓ వర్గం భక్తులపై దాడి చేసిందని, వారిని అదుపుచేయలేక పోలీసులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి

పాలకొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు పండించి పంటలు ప్రభుత్వం కొనుగోలు చేయాలని గిరిజన సంఘం నాయకులు బబనుచందర్, చంప కోరారు.ఈ మేరకు సోమవారం తహసీల్దార్ బాలమురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 80 బస్తా జీడిపిక్కలు రూ.16 వేలకు జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. గిరిజనులు నివాసముంటున్న ఈ ప్రాంతంలో ఉన్నత చదువులు చదువుకొనే విధంగా పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని, ప్రాథమిక పాఠశాలలో మూడు, నాలుగు, ఐదు తరగతులు చదువుతున్న విద్యార్థులకు మూడు నుంచి ఆరు కిలోమీటర్లు పరిధిలో మోడల్ స్కూల్‌లోకి తరలించే ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్‌చేశారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి



మునిసిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులు

సాలూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ కార్మికులు జీతాలు తక్షణమే చెల్లించడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు ఎన్‌వై నాయుడు డిమాండ్‌చేవారు. సోమవారం సాలూరు మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు.

తెరచుకోని అంగన్‌వాడీ కేంద్రాలు



నెలిపర్తిలో తెరవని అంగన్‌వాడీ కేంద్రం

సాలూరు రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు సోమవారం కార్యకర్తలు తెరవలేదు. జీతాలు పెంచాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయవాడలో నిరసన ప్రదర్శన చేశారు. విజయవాడకువెళ్లని వారు తమ కేంద్రా లను మూసి వేసి సంఘీభావం ప్రకటించారు. కాగా మండలంలో 173 అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకోలేదని సాలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు 61 వినతులు

సీతంపేట రూరల్,మార్చి 10(ఆంధ్రజ్యోతి):స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు(పీజీఆర్ఎస్) 61 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో టీడబ్ల్యూ ఈఈ పి.రమాదేవి, డిప్యూటీ ఈవో రవి ప్రసన్నకుమార్, పీహెచ్‌వో వెంకటగణేష్ ఏపీడీ సన్యాసినాయుడు, ఏటీడబ్ల్యువో మంగవేణి పాల్గొన్నారు.



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న యశ్వంత్‌కుమార్‌రెడ్డి

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

మక్కువ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎం.వెంకటరమణమూర్తి హెచ్చరించారు. స్థానిక చర్చి జంక్షన్ వద్ద సోమవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కఠిన చర్యలు తప్పవన్నారు.కార్యక్రమంలో శిక్షణ ఎస్ఐ అశోక్‌కుమార్, ఏఎస్ఐ ఎం.శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు విశిష్ట సంఖ్యను నమోదు చేయాలి

మక్కువ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రైతులు ఏపీఎఫ్ఆర్ పోర్టల్‌లో విశిష్ట సంఖ్యను సంబంధిత రైతు సేవా కేం ద్రాల్లో నమోదు చేసుకోవాలని ఏవో బొత్స శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా ఎవరైనా తమ పేర్లను నమోదు చేసుకోకపోతే వెంటనే వ్యవ సాయశాఖ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

కరాటే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

సీతంపేట రూరల్,మార్చి 10(ఆంధ్రజ్యోతి): అచ్చెబ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థులు జిల్లాస్థాయి కరాటే పోటీల్లో సత్తాచాటారు. విజయనగరం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన అంతర్ జిల్లాల కరాటే పోటీల్లో కె.దీపక్,ఎస్.హర్ష కటాస్ విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించారు. ఈ మేరకు విద్యార్థులను కరాటే కోచ్ కె .సందీప్, అల్లూరి జిల్లా కరాటే చైర్మన్ ఎస్.రామారావులు అభినందించారు.

ఘనంగా లక్ష్మీగణపతి స్వామి కల్యాణం



వినాయక ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సీతంపేట రూరల్,మార్చి 10(ఆంధ్రజ్యోతి):సీతంపేటలోని వినాయక ఆలయంలో సోమవారం సిద్ధిబుద్ధిసహిత శ్రీలక్ష్మి గణపతి స్వామి వారి కల్యాణాన్ని కనుల పండుగగా నిర్వహించారు. 46వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు వినాయక ప్రసాద అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం సాయంత్రం సీతంపేటలో స్వామి వారికి తిరువీధి మహోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

సీతంపేట రూరల్,మార్చి 10(ఆంధ్రజ్యోతి):సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ట్రైనీ ఎస్ఐ శిరీష, ఏఎస్సై సంజీవరావు సూచించారు.స్థానిక వారపుసంతలో సైబర్ నేరాల పై అవగాహన కల్పించారు.

13న స్టేట్‌ఫుడ్ కమిషన్ సభ్యుడు సమీక్ష

పార్వతీపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యా లయంలో ఈనెల 13న స్టేట్‌ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు సమీక్షించనున్నట్లు ఇన్‌చార్జి జేసీ కె.హేమలత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బుధవారం రాత్రికి జిల్లాకు చేరుకుంటారని పేర్కొన్నారు.

బాలేరులో సీమంతం

భామిని, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలేరు పీహెచ్‌సీ పరిధిలోగల గిరిజన గర్భిణులకు బాలేరు,సొలికిరి సత్యసాయి బాబాసేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం సీమంతం చేశారు. 26 మంది గర్భిణులకు చీర, జాకెట్, గాజులు, పౌష్టకాహారం, పండ్లు, పవ్వులు అందించారు. కార్య క్రమంలో సేవా సంఘం సభ్యులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరాములుకు నివాళి

పార్వతీపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో నాయకుడు ఆమనగంటి శ్రీరాములుకు సంఘ నాయకులు నివాళులర్పించారు.ఈ మేరకు పార్వతీపురంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరాములు 104 జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఏపీ ఎన్జీవో సహాధ్యక్షుడు జీవీ ఆర్ఎస్.కిషోర్, పుష్ప, శ్రీధర్, మంజుల, గణేష్ పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివించండి



మాట్లాడుతున్న ఏవో అనురాధ పండా

సాలూరు రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా చదివించాలని సాలూరు ఏవో అనురాధ పండా పిలుపునిచ్చారు.పందిరిమామిడివలసలో మన్య శ్యామలాంబ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ గ్రూప్ రైతులు మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో అనురాధ పండ, అన్నం రాజువలస సర్పంచ్ రాములమ్మ, టీచర్ విజయలక్ష్మి, వీఏఏ ప్రమీల,ఆశావర్కర్ రామలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, వెంకటలక్ష్మిలను ఎఫ్‌పీవో చైర్మన్ వెంకయ్య ఆధ్వర్యంలో సన్మానించారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

గరుగుబిల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధాన సూత్రాలు ప్రతి రైతుకు చేరాలని ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి కె.ప్రకాశ్ సూచించారు. సోమవారం మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయ ప్రాంగణంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాలకు చెందిన 130 మంది కార్యకర్తలకు ప్రకృతి వ్యవసాయంపై సంస్థ వ్యవ స్థాపకుడు డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షతన శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో రీజనల్ టెక్నికల్ అధికారి జిహేమసుందర్ పాలంబడి కన్సల్టెంట్ టి.శివాజీ, ఎస్ఎఫ్ఏలు జి.అన్నపూర్ణ, శారద, తిరుపతి, ముసలయ్య పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతే ధ్యేయం

గరుగుబిల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతే ధ్యేయంగా పార్టీ దృష్టిసారిస్తోందని అరకు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం చైర్మన్ బూరాడ రామ్‌మోహనరావు తెలిపారు. సోమవారం గరుగుబిల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో టీడీపీ తగిన ప్రాధాన్యత ఇచ్చి బీసీలపై ఉన్న ప్రేమను రుజువు చేసుకుందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్‌రెడ్డి హత్యలు, అక్రమ కేసులతో పాటు వేధింపులే అజెండాగా పెట్టుకున్నారని ఆరోపించారు.కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయం పాటిస్తూ బీసీలకు అండగా నిలుస్తోందన్నారు.